# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-10-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **స్వచ్ఛ భారత్ ప్రజల సహకారంతో ప్రజా ఉద్యమంగా మారిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
2. **రాష్ట్రాన్ని 2029 నాటికి స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.**
3. **గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.**
4. **రాష్ట్రంలో సాగునీటి సంఘాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
5. **వరదల కారణంగా ముంపు ప్రాంతాల్లో ధృవీకరణ పత్రాలు పోగొట్టుకున్న విద్యార్థులకు నకలు పత్రాలను ఉచితంగా అందిస్తామని ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రకటించింది.**

==========================

జాతిపిత మహాత్మాగాంధీ, పూర్వ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఈరోజు దేశ వ్యాప్తంగా ప్రజలు వారికి ఘనంగా నివాళులర్పిస్తూ... దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్మ, ఉపరాష్ట్రపతి జగదీప్ దన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర గవర్నరు ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం వేదికగా నివాళులర్పించారు.

--------------------------

స్వచ్ఛ భారత్ ప్రజల సహకారంతో ప్రజా ఉద్యమంగా మారిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. మహాత్మా గాంధీ 155వ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి ఈరోజు ఢిల్లీలో స్వచ్ఛభారత్ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన కార్యకమంలో ఆయన మాట్లాడుతూ, పరిశుభ్రత కోసం చేపట్టిన అతిపెద్ద ప్రచార కార్యక్రమాల్లో ఒకటైన స్వచ్ఛభారత్ మిషన్ పదేళ్లు పూర్తి చేసుకుందని అన్నారు. సమిష్టి కృషితోనే స్వచ్ఛ భారతం సాధ్యమవుతుందని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ (35 సెకన్లు)

--------------------------

రాష్ట్రాన్ని 2029 నాటికి స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ఈరోజు గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం జాతీయ కళాశాల ప్రాంగణంలో గాంధీ విగ్రహానికి ముఖ్యమంత్రి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ చేసిన పోరాటాన్ని గురించి ప్రస్తావిస్తూ...

..వాయిస్...35 సెకన్లు

---------------------------

గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు మంత్రులు, కలెక్టర్లు, అధికారులు పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. ఏలూరు, అనంతపురం, పార్వతీపురం మన్యం, చిత్తూరు, ఎన్టీఆర్, కృష్ణాజిల్లా, కాకినాడ, పశ్చిమగోదావరి, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో నిర్వహించిన స్వచ్ఛతా ర్యాలీ కార్యక్రమాల్లో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. దీనిపై మరిన్ని వివరాలను మా శ్రీకాకుళం ప్రతినిధి ఎస్.జోగినాయుడు అందిస్తారు.

..వాయిస్..36 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో సాగునీటి సంఘాలకు త్వరలో ఎన్నికల షెడ్యూలు విడుదల చేసి, 40 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. నిన్న విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో సాగునీటి సంఘాల వ్యవస్థను బలోపేతం చేయనున్నామని తెలిపారు. త్వరలో ఈ సంఘాలకు ఎన్నికలను నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వస్తు సేవల పన్ను -జిఎస్‌టి కమీషనర్ సాధు నరసింహ రెడ్డి తెలిపారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ప్రాంతీయ పాస్పోర్ట్ కేంద్రం, కస్టమ్స్, జిఎస్‌టి శాఖల ఆధ్వర్యంలో ఈ రోజు విజయవాడలో నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవా' వాక్ దాన్ ను ప్రాంతీయ పాస్పోర్ట్ కేంద్రం అధికారి శివహర్ష, ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీసాయి వెంపటితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహ రెడ్డి మాట్లాడుతూ , స్వచ్ఛత అనేది మానవ వ్యక్తిగత జీవన శైలికి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. స్వచ్ఛతా హి సేవా స్ఫూర్తిని అందరూ కొనసాగించాలని తెలుపుతూ,

వాయిస్ ( 24 సెకన్లు)

---------------------------

రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాలి మండలం సౌడాం గ్రామంలో ఈరోజు నిర్వహించిన గ్రామ సభలో మంత్రి పాల్గొని స్థానికులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. పంచాయతీలు స్వయం సమృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈ సభలను నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈరోజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఉప ముఖ్యమంత్రి కుటుంబానికి వేద పండితులు వేద ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రంలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా అన్నప్రసాద నాణ్యతను గురించి భక్తులను అడిగి తెలుసుకున్నారు. కాగా ఉపముఖ్యమంత్రి ఈరోజు రాత్రికి తిరుమలలోని బస చేసి రేపు ఉదయం తిరుపతికి చేరుకుని వారాహి బహిరంగ సభలో పాల్గొంటారు.

---------------------------

రాష్ట్రంలో రేపటి నుంచి జరగనున్న ఉపాధ్యాయుల అర్హత పరీక్ష – టెట్–2024 పరీక్షలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. దీనిపై మా ఆకాశవాణి ప్రతినిధి అందిస్తున్న మరిన్ని వివరాలను ఇప్పుడు విందాం.

..వాయిస్..

---------------------------

వరదల కారణంగా ముంపు ప్రాంతాల్లో ధృవీకరణ పత్రాలు పోగొట్టుకున్న విద్యార్థులకు నకలు పత్రాలను ఉచితంగా అందించాలని ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. విజయవాడతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వరదలకు ఇళ్లు నీట మునగడంతో చాలామంది విద్యార్థుల సర్టిఫికెట్లు కోల్పోయినట్లు గుర్తించామని, ఇలాంటి వారికి ఎటువంటి రుసుములూ లేకుండా ఉచితంగా సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు బోర్డు ఒక ప్రకటన తెలిపింది.

---------------------------

స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన ప్రముఖులు, "జై జవాన్, జై కిసాన్" నినాదాన్ని అందించి... భారతదేశానికి రెండవ ప్రధాన మంత్రిగా వ్యవహరించిన లాల్ బహదూర్ శాస్త్రి జయంతి కూడా ఈ రోజు. ఈ సందర్భంగా దేశాభివృద్ధికి ఆయన అందించిన సేవలను ప్రజలు స్మరించుకుంటున్నారు. 1904వ సంవత్సరం అక్టోబర్ 2వ తేదీన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మొఘల్ సరాయ్ పట్టణంలో జన్మించిన ఆయన... స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మాగాంధీకి అత్యంత ప్రియశిష్యునిగా పేరు తెచ్చుకున్నారు. దేశానికి ఆ మహనీయుడు చేసిన సేవలకు గుర్తింపుగా 1966 వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఆయనను భారత రత్న పురస్కారంతో సత్కరించింది.

=====================